ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ: 18.08.2024 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.
2. రుణమాఫీ విషయంలో రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని , అర్హులైనవారికి న్యాయం చేస్తామని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు.
3. గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్ఠమైన ఏర్పాట్లు చేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.
4. పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఈ రోజు ఘనంగా జరుపుకుంటున్నారు.

**పొంగులేటి**

ధరణి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఆస్తులు కాపాడే విషయంలో చట్టం తనపని తాను చేసుకుపోతుందని ఒత్తిళ్లకు తలొగ్గేది లేదని ఆయన స్పష్టం చేశారు. హైడ్రా పనితీరును సమర్థిస్తూ , జిల్లా కేంద్రాలలో కూడా ఇలాంటి వ్యవస్థలను ఏర్పాటు చేసే ఆలోచనతో ప్రభుత్వం ఉందని శ్రీనివాస్ రెడ్డి ఈ రోజు హైదరాబాద్ లో చెప్పారు. భూ సమస్యలు శా శ్వతంగా పరిష్కరించేందుకు ఆర్ ఒ ఆర్ చట్టాన్ని రెండు మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా చేపట్టామని మంత్రి తెలపారు. స్టాంపులు రిజిస్ట్రేషన్లు , రెవెన్యూ శాఖ లో అవినీతిని ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తుల పరిష్కారం నిబం ధనలకు లోబడే ఉంటుందని పేర్కొన్నారు. పేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చే విషయంలో సొంత స్థలాలు ఉన్నవారికి మొదటి ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. రిజిస్ట్రేషన్ల విలువల పెంపు విషయంలో బిల్డర్ల ప్రతిపాదనలు కూడా పరిశీలిస్తున్నామని శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.

**(పిటిసి)**

**రుణమాఫీ-జూపల్లి**

రుణమాఫీ విషయంలో రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు . రైతు రుణమాఫీపై మహబూబ్ నగర్ లో వ్యవసాయ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష

నిర్వహించారు. మూడో విడతలో కూడా రుణమాఫీ రాని రైతులకు గ్రీవెన్స్ సెల్ ద్వారా రుణమాఫీ డబ్బులు అందుతాయని జూపల్లి తెలిపారు . రెండు లక్షలలోపు రుణాలు ఉండి , రేషన్ కార్డు లేనివారు , ఆధార్ కార్డు వివరాలు తప్పుగా నమోదైనవారు మరే ఇతర కారణముతోనైనా రుణమాఫీ వర్తించని వారు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలని , వారు రికార్డులను పరిశీలించి అర్హులైన రైతులకు రుణమాఫీ వర్తింపచేస్తారని మంత్రి స్పష్టం చేశారు . రైతు కుటుంబ నిర్ధారణ కోసం మండల వ్యవసాయాధికారి స్వయంగా రైతు కుటుంబాల దగ్గరికి వెళ్లి ఖాతాదారులు, వారి కుటుంబ సభ్యుల వివరాలు తీసుకుని పోర్టల్ లో అప్ లోడ్ చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు.

**(STRINGER)**

**సురేఖ- పోడు**

రాష్ట్రంలో పోడు భూముల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు మార్గదర్శకాలు రూపొందించాలని అటవీ , పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు . పోడు భూముల సమస్యలపై పంచాయతీరాజ్ , గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కతో కలిసి మంత్రి సురేఖ జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ , అటవీ అధికారులు, గిరిజనులకు మధ్య నెలకొన్న ఘర్షణ నివారించి సుహృద్భావ వాతావరణం నెలకొనేలా విధివిధానాలు రూపొందించాలని సూచించారు . పోడు భూముల సమస్యపై విధివిధానాలు సిద్ధం చేశాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో సమావేశం నిర్వహించి ఆమోదం పొందవచ్చని తెలిపారు . పోడు పట్టాల కోసం

పెండింగ్లో ఉన్న దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలని , పట్టాలు ఇచ్చేందుకు అర్హత లేకపోతే ఆ విషయాన్ని అర్థమయ్యేలా వివరించాలని మంత్రి సీతక్క సూచించారు. అడవులు నరకకుండా ప్రజలలో అవగాహన పెంచడం సహా , అడవుల్లో పండ్ల మొక్కలు పెంచి స్థానికులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు.

**(DESK)**

**డ్రగ్స్- డి జి పి**

తెలంగాణాను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలనేదే ప్రభుత్వ లక్ష్యమని , మాదక ద్రవ్యాల కట్టడికి పటిష్ఠ వ్యవస్థను ఏర్పాటు చేసిందని డీజీపీ జితేందర్ తెలిపారు . డ్రగ్స్ వాడేవారు భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని ఆయన హెచ్చరించారు . సమాజంలో మరో అతిపెద్ద సమస్య ర్యాగింగ్ అని , ఇప్పటికే రాష్ట్రంలో నిషేధించిన ర్యాగింగ్కు ఎవరైనా పాల్పడితే కఠిన చర్యలు తప్ప వని డి జి పి స్పష్టం చేశారు . ఉన్నత విద్యామండలి ఆధ్వర్యంలో డ్రగ్స్ వినియోగం , ర్యాగింగ్ పై నిన్న హైదరాబాద్లో ఏర్పాటైన అవగాహన సదస్సు లో ఆయన ప్రసంగించారు . విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశం మాట్లాడుతూ , ర్యాగింగ్ విష సంస్కృతిని కూకటి వేళ్లతో సహా పెకలించివేయాలని పిలుపునిచ్చారు . యాంటీ నార్కోటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్యమాట్లాడుతూ, డ్రగ్స్, ర్యాగింగ్ పై బాధ్యతగల పౌరులు పోలీసులకు ఫిర్యాదు చెయ్యాలని సూచించారు.

**(DESK)**

**డెంగ్యూ – వరంగల్**

వరంగల్ జిల్లాలో పెరుగుతున్న జ్వరాలు , డెంగ్యూ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టామని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. వెంకటరమణ చెప్పారు. జిల్లాలో ఇప్పటివరకు 3 మలేరియా , 63 డెంగ్యూ కేసులు నమోదు అయ్యాయని పేర్కొన్నారు. అయితే ఎలాంటి మరణాలు లేవని ఆయన ఆకాశవాణికి చెప్పారు.

బైట్

**(పిటిసి-వరంగల్)**

**గణేష్- పొన్నం**

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేస్తామని బీసీ సంక్షేమ , రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు . గణేష్ నిమజ్జన ఉత్సవాలు, నిమజ్జనాల పై మంత్రి సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు . హుస్సేన్ సాగర్ చుట్టూ నిమజ్జనం కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామన్నారు . గణేష్ నిమజ్జన ఉత్సవాలు ముంబయి తర్వాత అత్యంత వైభవంగా హైదరాబాద్ లోనే జరుగుతాయని , హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ను మరింత పెంపొందించే విధంగా ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి తెలిపారు . గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

**(DESK)**

**లీడ్ సర్వాయి పాపన్న**

పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఈ రోజు ఘనంగా జరుపుకుంటున్నారు. హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగిన కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ పాపన్న గౌడ్ తెలంగాణ వీరత్వానికి , పరాక్రమానికి ప్రతీక అని అన్నారు . పాపన్న గౌడ్ స్వస్థలం అభివృద్ధి కోసం టూరిజం శాఖ నుంచి 4 కోట్ల 70 లక్షల రూపాయలను విడుదల చేసినట్లు ఆయన చెప్పారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

**(డెస్క్)**

**నల్గొండ**

నల్గొండలో జరిగిన కార్యక్రమంలో అదనపు కలెక్టర్ టి. పూర్ణచంద్ర ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. బడుగు , బలహీన వర్గాలపై అరాచకాలకు వ్యతిరేఖంగా సర్దార్ సర్వాయి పాపన్న చేసిన పోరాటాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు.

**(పిటిసి)**

**వనపర్తి – పాపన్న గౌడ్**

వనపర్తి జిల్లా కేంద్రంలో జరిగిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి కార్యక్రమంలో శాసన సభ్యుడు టి. మేఘారెడ్డి అదనపు కలెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

(పిటిసి- వనపర్తి)

**నాగర్ కర్నూల్**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎం ఎల్ ఎ డా. రాజేష్ రెడ్డి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ , గౌడ సంఘాల నాయకులు కూడా పాపన్న గౌడ్ విగ్రహానికి నివాళులు అర్పించారు.

(పిటిసి – నాగర్ కర్నూల్)

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ కలెక్టేరేట్ లో జరిగిన వేడు కలకు జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాపన్న గౌడ్ స్ఫూర్తితో వెనుకబడిన తరగతుల వారు రాజ్యాధికారం కోసం పోరాడాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

(పిటిసి-ఆసిఫాబాద్)

**జగిత్యాల**

జగిత్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో పాపన్న గౌడ్ చిత్ర పటానికి అదనపు కలెక్టర్ రాంబాబు పూల మాల వేసి నివాళులు అర్పించారు.

(పిటిసి- జగిత్యాల)

**జగిత్యాల - పంచాయతీలు**

జగిత్యాల జిల్లాలో నూతనంగా మరో రెండు గ్రామపంచాయతీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది బీర్పూర్ మండలం లోని మంగల నుంచి గుండు గూడెం ను , నరసింహులపల్లి నుంచి ఇందిరానగర్ ను విభజించి ప్రత్యేక గ్రామపంచాయతీలుగా ఏర్పాటు చేశారు.

**మధిర- వైద్య శిబిరం**

ఖమ్మం జిల్లా మధిర లో మెగా వైద్య శిబిరాన్ని ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారి వెంకట్ లాల్ ప్రారంభించారు . ఈ సందర్భంగా మాట్లాడుతూ , నిరుపేదలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలన్న లక్ష్యంతో కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో ఆరోగ్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**(PTC)**

**పెద్దపల్లి**

పెద్దపల్లి జిల్లాలో ప్రభుత్వ ఆస్తుల సంరక్షణ కోసం జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశారు. జిల్లాలోని ప్రభుత్వ భూములు , చెరువులు, కుంటలు, శిఖం భూములు మొదలైన ఆస్తులు ఆక్రమణలకు గురి కాకుండా సంరక్షించడానికి ఈ కమిటీని ఏర్పాటు చేసినట్టు కలెక్టర్ సి. శ్రీ హర్ష తెలిపారు.

**(పిటిసి – పెద్దపల్లి)**

**నిర్మల్ ఓటర్లు**

నిర్మల్ జిల్లాలో ఇంటింటి సర్వేలో భాగంగా ఓటర్ల వివరాలను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. ఇందులో భాగంగా రేపటి నుంచి రెండు రోజుల పాటు సూపర్ వైజర్లకు , బి ఎల్ ఒ లకు శిక్షణ ఇవ్వాలని సూచించారు.

**(పిటిసి – నిర్మల్)**

**నాగార్జున సాగర్**

నాగార్జున సాగర్ ప్రాజెక్టు ఎడమ కాలువ , ఎ ఎం ఆర్ పి , వరద కాలువల ద్వారా అన్ని గ్రామాలకు సాగు నీరు అందిస్తామని , రైతులు ఎవరూ ఆందోళన చెందనవసరం లేదని నల్గొండ జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి తెలిపారు. నాగార్జున సాగర్ ప్రాజెక్టులో పూర్తి స్థాయి నీరు నిల్వ ఉందని , అన్ని గ్రామాల్లోని రైతులకు క్రమపద్ధతిలో సాగు నీరు అందిస్తామని ఆయన చెప్పారు.

**(పిటిసి- నల్గొండ)**

**జగిత్యాల - పండ్ల తోటలు**

పండ్ల తోటల పెంపకానికి రైతులు ముందుకు రావాలని జగిత్యాల జిల్లా డి ఆర్ డి ఏ అదనపు ప్రాజెక్ట్ డైరెక్టర్ మదన్ మోహన్ రైతులను కోరారు . సన్నకారు రైతులకు ఉద్యానవన పంటలను ప్రోత్సహించే విధంగా జిల్లా వ్యాప్తంగా 900

ఎకరాల్లో పండ్ల తోటలను పెంచేందుకు లక్ష్యాన్ని నిర్దేశించు కున్నామని ఆయన అన్నారు.

**(PTC)**

**రాజన్న సిరిసిల్ల - జలాశయం**

రాజన్న సిరిసిల్ల లోని మిడ్ మానేరు ప్రాజెక్టు లోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 4,500 క్యూసెక్కులు , మూల వాగు నుంచి 590 క్యూసెక్కులు ఇన్ ఫ్లో వచ్చి చేరుతోందని ప్రాజెక్ట్ అధికారులు తెలిపారు . ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్లకు గాను ప్రస్తుతం 312.44 మీటర్లు ఉంది.

**(PTC)**